

బారికేడ్ల నడుమ అంగన్‌వాడీలు

బెదిరించినా సమ్మె ఆగదు

ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీల ఆగ్రహం



కలెక్టరేట్ వద్ద శిబిరంలో నిరసన

అనంతపురం విద్య, జనవరి 4: సమస్యలను పరిష్కరించాలని సమ్మెకు దిగిన తమను ప్రభుత్వం బెదిరిస్తోందని, అయినా తగ్గేది లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. సమ్మెలో భాగంగా 24వ రోజు గురువారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు కొనసాగించారు. కలెక్టరేట్ వద్ద శిబిరంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వేతనాలను రూ.26 వేలకు పెంచాలని, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. వర్కర్స్ యూనియన్ నగర నాయకురాలు జయభారతి సోది చెబుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఇతర సంఘాల నాయకులు ప్రసంగించారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టినప్పుడే బెదరలేదని, నోటీసులకు ఏమాత్రం భయపడమని హెచ్చరించారు. అంగన్వాడీలు విధుల్లో చేరకుంటే చర్యలు తీసుకుంటామని తన శాఖకాపోయినా మంత్రి బొత్స సత్యనారాయణ బెదిరిస్తున్నారని, ఆ శాఖ మంత్రి ఉష శ్రీచరణ్ ఏమీ ఎరగనట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎవరు ఎన్ని బెదిరింపులకు దిగినా సమ్మె విరమించబోమని అన్నారు. ఆమరణ దీక్షలకూ సిద్ధమని పేర్కొన్నారు. కాగా, ఈ నెల 6న బుక్కరాయసముద్రంలో జరిగే కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ వస్తుండటంతో అంగన్వాడీల శిబిరం చుట్టూ పోలీసులు ఇనుప బారికేడ్స్ ఏర్పాటు చేయడం విమర్శలకు తావిచ్చింది. కలెక్టరేట్ సమీపంలోని చెరువుకట్ట రోడ్డు మీదుగా బుక్కరాయసముద్రానికి గవర్నర్ వెళతారు. అంగన్వాడీల దీక్షా శిబిరం ఈ రోడ్డు పక్కనే ఉంది.

విజయవాడకు సమగ్రశిక్ష ఉద్యోగులు

అనంతపురం విద్య: చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనేందుకు సమగ్రశిక్ష ఉద్యోగులు అనంతపురం నుంచి గురువారం రాత్రి బయలుదేరారు. 16 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ప్రాజెక్టు స్టేట్ డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించాలని నిర్ణయించారు. ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ విజయ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, ఉద్యోగులు విజయవాడకు వెళ్లారు. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు రైళ్లు, బస్సుల్లో తరలివెళ్లారు. కేజీబీవీ ఉద్యోగులను తొలగిస్తామని అధికారులు బెదిరించడంతో కొందరు విధులకు వెళ్లారు.



విజయవాడకు బయలుదేరిన నాయకులు, ఉద్యోగులు

నగరపాలిక.. మున్సిపాలిటీల్లో

సమ్మె ఉధృతం

నగరానికి తాగునీటి సరఫరా నిలిపివేత
తాడిపత్రిలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఘెరావ్



ఎమ్మెల్యే పెద్దారెడ్డితో కార్మికుల వాగ్వాదం



అనంతలో మోకాళ్లపై అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న సీపీఐ జాఫర్, నాయకులు



సీఐటీయూ నాయకులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

అనంతపురం క్రైం/తాడిపత్రి/కూడేరు, జనవరి 4: జిల్లాలో మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల సమ్మె గురువారం పదో రోజు కొనసాగింది. అనంతపురంలో సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. యూనియన్ నాయకుడు నాగభూషణం ఇంజనీరింగ్ కార్మికులతో కలిసి అనంతపురానికి నీటి సరఫరా చేసే కొత్రకొల్లు డ్యామ్ వద్ద రెండు గంటల పాటు నీటి సరఫరాను నిలిపివేయించారు. వారిని కూడేరు పోలీసులు అడ్డుకున్నారు. అనంతపురంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా అధ్యక్షుడు చిరంజీవి ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి అర్ధనగ్న ప్రదర్శన చేశారు. నగరంలో చెత్త తరలింపు వాహనాలను అడ్డుకున్నారు. తాడిపత్రిలో చెత్త తరలింపు కోసం ప్రైవేటు వాహనాలను, కార్మికులను పురమాయించడంతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేని ఘెరావ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పది రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేతో తీవ్రస్థాయిలో వాగ్వాదం చేశారు. ట్రాక్టర్లను, ప్రైవేటు కార్మికులను ఉపసంహరించాలని, లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఎమ్మెల్యేని హెచ్చరించారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. ఎమ్మెల్యేతో వాగ్వాదం చేస్తున్న వారిని బలవంతంగా పక్కకు తీసుకువెళ్లారు. కార్మికులు రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు ఈడ్చుకువెళ్లి జీపులో వేశారు. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ వర్కర్లు మున్సిపల్ కార్మికులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. పట్టణ పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించారు. దీంతో అంగన్‌వాడీలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు.



డ్యాంలోని నీటి పంపు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

సీకే పల్లి పోలీస్‌స్టేషన్‌పై ఏసీబీ దాడులు

పారిపోయిన సీఐ.. అదుపులో ఎస్ఐ!

(వివరాలు 7లో...)



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

ఆగ్రోస్‌కు ఆస్తుల జప్తు నోటీసు

22 ఏళ్ల నాటి కేసులో ఉత్తర్వులు



ఆగ్రోస్ ఆఫీస్ ఎదుట దండోరా వేస్తున్న కోర్టు సిబ్బంది

అనంతపురం అర్బన్, జనవరి 4: అనంతపురం ఆగ్రోస్ సంస్థ ఆస్తులను జప్తు చేస్తూ ఆ సంస్థ ఉన్నతాధికారులకు అనంతపురం లేబర్ కోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. తనను అన్యాయంగా ఉద్యోగం నుంచి తొలగించారని, తనకు రావాల్సిన బెనిఫిట్స్‌ను ఇప్పించాలని కోరుతూ ఆగ్రోస్‌లో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేసిన ఈశ్వర్‌రెడ్డి 22 ఏళ్ల క్రితం అనంతపురం లేబర్ కోర్టును ఆశ్రయించాడు. 2003లో ఆయనకు అనుకూలంగా లేబర్ కోర్టు తీర్పునిచ్చింది. తనకు తిరిగి ఉద్యోగం ఇవ్వాలని, సర్వీస్‌కు సంబంధించి 50 శాతం వేతనాన్ని ఇవ్వాలని కోర్టు అప్పట్లో ఆదేశించిందని బాధితుడు తెలిపారు. లేబర్ కోర్టు తీర్పుపై సంస్థ ఉన్నతాధికారులు హైకోర్టును ఆశ్రయించి, తిరిగి వారే కేసును వెనక్కి తీసుకున్నారని తెలపారు. ఈ నేపథ్యంలో తాను తిరిగి లేబర్ కోర్టును ఆశ్రయించానని తెలిపారు. విచారించిన కోర్టు, తనకు రావాల్సిన రూ.36 లక్షల బెనిఫిట్స్ కోసం ఆగ్రోస్ ఆస్తిని జప్తు చేసినట్లు నోటీసులు జారీ చేసిందని తెలిపారు. కాగా, కోర్టు సిబ్బంది బళ్లారి రోడ్డులోని ఆగ్రోస్ కార్యాలయం నోటీసు బోర్డులో సంస్థ ఆస్తి జప్తు నోటీసులను గురువారం అతికించి, దండోరా వేశారు. కోర్టు నుంచి జప్తు నోటీసులు అందాయని, ఆ వివరాలను ఉన్నతాధికారులకు పంపామని ఆగ్రోస్ ఇన్‌చార్జి ఆర్ఎం విద్యాసాగర్ తెలిపారు.

కార్మికులను బెదిరిస్తారా..?

- చేతనైతే సమస్యలను పరిష్కరించండి
- ప్రభుత్వంపై సీపీఎం రాంభూపాల్ ఫైర్



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జనవరి 4: సమస్యల పరిష్కారంకోసం చట్టబద్ధంగా సమ్మె చేస్తున్న కార్మికులను బెదిరించడం తగదని, చేతనైతే సమస్యలను పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. ఈ నెల 5వ తేదీ నాటికి అంగన్‌వాడీలు, 6వ తేదీ నాటికి సమగ్ర శిక్ష ఉద్యోగులు విధుల్లో చేరాలని, లేనిపక్షంలో ఉద్యోగాలనుండి తొలగిస్తామని అధికారులు నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని ఆయన అన్నారు. నగరంలోని గణేనాయక్ భవన్‌లో గురువారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ సంఘాల నాయకులతో మంత్రులు, అధికారులు మూడుసార్లు చర్చలు జరిపారని, అయినా సమస్యలను ఎందుకు పరిష్కరించలేకపోయారని ప్రశ్నించారు. లక్షమందికి పైగా అంగన్‌వాడీలు 24 రోజులుగా సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి కనీసం స్పందించలేదని అన్నారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్నవారిని రెచ్చగొట్టేలా కొందరు మంత్రులు, ఎమ్మెల్యే ప్రకటనలు చేయడం, కలెక్టర్ల ద్వారా నోటీసులు ఇప్పించి బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. సమ్మెను అణచివేయాలని చూడడాన్ని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని కోరారు. 16 రోజులుగా సమ్మెలో ఉన్న సమగ్రశిక్ష ఉద్యోగులందరినీ తొలగిస్తామని జిల్లా అధికారులిచ్చిన నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు కొందరు ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ప్రయత్నించడం సిగ్గుచేటని అన్నారు. కరోనా సమయంలో మున్సిపల్ కార్మికులకు మొక్కాలని పొగిడిన నోర్లు నేడు వారి నోరు కొట్టాలని చూడడం దారుణమని అన్నారు. తాడిపత్రిలో స్వయానా ఎమ్మెల్యే ప్రైవేట్ వ్యక్తులతో పనిచేయించడానికి ప్రయత్నించడం దుర్మార్గమని అన్నారు. అనంతపురం నగరపాలకసంస్థ పరిధిలో కొందరు కార్పొరేటర్లు చెత్త తరలింపు పురిట సమ్మెను సొమ్ముగా మలుచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్మికులకు అండగా సీపీఎం ప్రజలను కూడగట్టుకుని పోరాడుతుందని తెలిపారు. 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజాసంఘాలు, సంస్థలు, వ్యక్తులతో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించి, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందిస్తామని, 9వ తేదీ నుంచి ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమవుతామని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నల్లప్ప, నాగేంద్రకుమార్, సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, రామాంజనేయులు, రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, తరిమెల నాగరాజు, భాస్కర్, అచ్యుత్, వెంకటనారాయణ, నిర్మల, ముష్కిన్ పాల్గొన్నారు.

జగన్‌వి క్యాష్ పాలిటిక్స్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్



అనంతపురం విద్య, జనవరి 4: వైసీపీలో ఎంపీ, ఎమ్మెల్యే టికెట్ల చుట్టూ క్యాష్ పాలిటిక్స్ నడుస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జగదీశ్ విమర్శించారు. కర్ణాటక నుంచి అభ్యర్థులను దిగుమతి చేసుకోవడంద్వారా ఉమ్మడి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీల మనోభావాలను ముఖ్యమంత్రి జగన్ దెబ్బతీశారన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. హిందూపురం ఎంపీ అభ్యర్థిగా కర్ణాటకకు చెందిన మాజీ ఎంపీ శాంతను, హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా కర్ణాటక నుంచి మరో మహిళా అభ్యర్థిని దిగుమతి చేసుకున్నారని విమర్శించారు. జిల్లాలోని తన పార్టీ అభ్యర్థులపై జగన్‌కు నమ్మకం లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లక్షలాదిమంది కురబలు, బోయలు ఉన్నా.. జగన్‌కు ఒక్కరూ కనిపించలేదా అని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇన్‌చార్జిలను మాత్రమే జగన్ మారుస్తున్నారని, తన సామాజికవర్గం వారిని మాత్రం మార్చడంలేదని విమర్శించారు. జగన్‌కు దమ్ముంటే రీజనల్ సమన్వయకర్తలు పెద్దిరెడ్డి, సజ్జల, విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిని మార్చాలని సవాలు విసిరారు. ఎమ్మెల్యే టికెట్‌కు రూ.30 కోట్లు డిపాజిట్ అడుగుతూ, జగన్ ధనరాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, మల్లికార్జున, నాయకులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సు సర్వీసులు

అనంతపురం కల్చరల్, జనవరి 4: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రీజియన్‌లోని అన్ని డిపోల నుంచి వివిధ ప్రాంతాలకు మొత్తం 186 బస్సు సర్వీసులు నడపడం జరుగుతుందన్నారు. పండుగకు ఊళ్లకు వెళ్లేవారికోసం ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు 102 బస్సులు, అదేవిధంగా పండుగ అనంతరం ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు తిరుగు పయనంకోసం 84 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. అయితే ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని, సాధారణ టికెట్ ధరలే ఉంటాయని, ముందస్తు రిజర్వేషన్ చేసుకున్నవారికి టికెట్ ధరల్లో 10శాతం రాయితీ కల్పించడం జరుగుతుందన్నారు.

గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

బుక్కరాయసముద్రం, జనవరి 4: గవర్నర్ అబ్దుల్ నజీర్ జిల్లాకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఎస్పీ అన్బురాజన్ గురువారం పరిశీలించారు. మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ వికాస్ సంకల్ప్ యాత్ర అవగాహన కార్యక్రమానికి గవర్నర్ వస్తున్నారు. ఈ నేపథ్యంలో సభా వేదిక స్థలం, వాహనాల పార్కింగ్, రూట్‌మ్యాప్, భద్రత తదితర విషయాలపై పోలీసు, రెవెన్యూ జిల్లా అధికారులతో ఆయన మాట్లాడారు. ఎక్కడా సమస్య తలెత్తకుండా చర్యలు ఉండాలని డీఎస్పీ శివారెడ్డిని ఆదేశించారు.

అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తాం


పరిటాల శ్రీరామ్‌ను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు


అవ్వను ఆప్యాయంగా పలకరిస్తూ...


పాదయాత్రలో పాల్గొన్న తెలుగు మహిళలు

టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జనవరి 4: అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. గురువారం గుట్టకిందపల్లిలో ప్రజాచైతన్యయాత్రను కొనసాగించారు. ప్రతి వార్డుకు వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తాను నోట్‌చేసుకున్నానని, ఇందుకనుగుణంగా మేనిఫెస్టోను రూపొందిస్తానన్నారు. అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రతి రోజు గుడ్‌మార్నింగ్ అంటూ రెండుగంటలపాటు ఉదయం షో చేస్తున్నారని, ప్రజాసమస్యలపై చిత్తశుద్ధి ఉంటే వాటిని ఎప్పుడో పరిష్కరించేవారన్నారు. టీడీపీ హయాంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపామని, ఇందుకు సంబంధించి తొలిసంతకం చేసింది మాజీ మంత్రి పరిటాలసునీత అని గుర్తు చేశారు. ఎస్టీ జాబితాలో చేర్చే అంశం చంద్రబాబు దృష్టిలో ఉందని, అధికారంలోకి రాగానే తనవంతుగా మరోమారు ఆయన దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాగా పరిటాల శ్రీరామ్ పాదయాత్రకు అనూహ్య స్పందన లభించింది. గ్రామస్థులు పూల వర్షం కురిపిస్తూ బ్రహ్మరథం పట్టారు. పాదయాత్రలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగుమహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పాట్

పాఠాలు బోధించనివారితో స్పాట్‌వాల్యుయేషన్


సరైన జవాబుకూ సున్నా మార్కులు

వెరిఫికేషన్‌లో బయటపడిన వైనం

అయోమయంలో విద్యార్థులు

> సబ్జెక్టుతో సంబంధంలేని వారితో జవాబు పత్రాలు దిద్దిస్తుండటంతో విద్యార్థుల జీవితాలు అయోమయంలో పడుతున్నాయి. పరీక్షలు బాగా రాశాం... మంచి మార్కులు వస్తాయనుకున్న విద్యార్థులు వచ్చిన మార్కులను చూసి నివ్వెరపోతున్నారు. మేము రాసిన జవాబుపత్రాలనే దిద్దారా అంటూ సందిగ్ధంలో పడుతున్నారు. వెరిఫికేషన్‌కు వెళ్లి తమ జవాబు పత్రాలను పరిశీలిస్తే సరైన జవాబుకూ సున్నా మార్కులు వేయడం చూసి ఆశ్చర్యపోతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఉన్నతాధికారులకు విన్నవించుకుంటున్నారు. ఇది జేఎన్‌టీయూలో పరిస్థితి.

అనంతపురం సెంట్రల్, జనవరి 4: జేఎన్‌టీయూ పరిధిలో సీటు వచ్చిందంటే విద్యార్థులు ఎగిరి గంతేస్తారు. మంచి మార్కులు సాధిస్తే తప్ప అందులో సీటు రాదు. అటువంటి చరిత్ర ఉన్న కళాశాల పరిస్థితి రాను రాను మసకబారుతోంది. ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్‌లో ప్రశ్నపత్రాల లీకేజీ జరగడం, జవాబులు కరెక్టుగా రాసినా సున్న మార్కులు వేస్తుండటం ఇందుకు నిదర్శనమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడిన అధికారులను ఉన్నతాధికారులుగా నియమిస్తున్నారన్న ఆరోపణలుసైతం వస్తున్నాయి. దీంతో విద్యార్థుల భవిష్యత్తు గందరగోళంగా తయారవుతున్నాయంటున్నారు. తాము పరీక్షల్లో సరైన జవాబు రాసినా సబ్జెక్టుతో సంబంధంలేనివారితో మూల్యాంకనం చేయిస్తూ తమను అయోమయంలో పడేస్తున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు పరీక్షలు రాసిన అనంతరం జవాబు పత్రాలను ఉమ్మడి ఐదు జిల్లాలనుంచి జేఎన్‌టీయూకి తీసుకువస్తారు. ఇక్కడి నుంచి కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, నంద్యాలలో ఏర్పాటుచేసిన స్పాట్ వాల్యుయేషన్ సెంటర్లకు తరలించి మూల్యాంకనం చేయిస్తారు. ఏ సబ్జెక్టు బోధిస్తారో ఆ అధ్యాపకుడికి విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను ఇచ్చి దిద్దించాలి. అయితే ఒకటి, రెండు సబ్జెక్టులు బోధించేవారికి అన్ని జవాబు పత్రాలను దిద్దించడం, ఇష్టమొచ్చినట్లు బండిల్ ఇష్యూచేయడం, కొందరికే రెగ్యులర్ డ్యూటీ వేయడం లాంటివి జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రతిభ ఉన్న విద్యార్థులు సైతం ఫెయిల్ అవుతున్నారని అంటున్నారు.


జవాబు పత్రంలో జీరో మార్కులు వేసి దృశ్యం

● అధికారుల నిర్లక్ష్యం

జేఎన్‌టీయూ పరీక్షల నిర్వహణ విభాగంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్(డీఈ), కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీఈ), ముగ్గురు అసిస్టెంట్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఏసీఈ)తోపాటు డిప్యూటీ రిజిస్ట్రార్(డిఆర్), అసిస్టెంట్ రిజిస్ట్రార్(ఏఆర్) స్థాయిలో ఒక అధికారి మొత్తం ఆరుగురు రెగ్యులర్ అధికారులు పనిచేస్తున్నారు. ఆర్థిక పరమైన అంశాలను డీఆర్, ఏఆర్‌లు పర్యవేక్షిస్తారు. ఏసీ-3 పరిధిలో బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థుల పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని చూస్తారు. ఏసీ-2లో బీటెక్ విద్యార్థుల పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం, అందుకు తగిన ఫ్యాకల్టీలకు డ్యూటీ వేస్తారు. ఏసీ-1 ప్రశ్నపత్రాల రూపకల్పన, సర్టిఫికెట్స్ జారీ అంశాలను చూస్తారు. మిగిలిన పనులన్నీ చేయడానికి దాదాపు 80మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారు. మొత్తం కార్యకలాపాలను పర్యవేక్షించి వాటిని ఓకే చేయడానికి డైరెక్టర్ ఎవాల్యుయేషన్(డీఈ) అధికారి ఉంటారు. ఇంత పకడ్బందీగా వ్యవస్థ ఉన్నా అక్రమాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నాయని, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. రాజకీయ సిఫార్సులు, ఉన్నతాధికారుల అండదండలు పుష్కలంగా ఉంటుండటంతోనే పారదర్శకతకు, అనుభవానికి పాతరేస్తున్నారంటున్నారు.

● వీసీకి ఓ విద్యార్థి లేఖ

జేఎన్‌టీయూలో ఇటీవల ఓ విద్యార్థి వీసీకి లేఖ రాశాడు. "పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తానని ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూకి వెళ్లాను. అందులో ఎంపికయ్యాను. అయితే ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాను. మంచి మార్కులు వస్తాయనుకున్న నేను ఫెయిల్ అవ్వడం ఏంటని ఫిజికల్ వెరిఫికేషన్‌ను వెళ్లాను. జవాబు పత్రాలను తెప్పించి తనకు బోధించిన అధ్యాపకుడికి చూపిస్తే ఆశ్చర్యపోయారు. సరైన సమాధానానికీ సున్న మార్కులు వేశారు. వెంటనే నేను రాసిన జవాబు పత్రాన్ని దిద్దించి త్వరగా నాకు రిజల్ట్ అనౌన్స్ చేయండి. నాకు ఉద్యోగం వస్తుంది. నిర్లక్ష్యం చేస్తే నేను సాధించిన ఉద్యోగాన్ని కోల్పోతాను" అని వీసీకి లేఖ రాశాడు.

● స్పందించని అధికారులు

విద్యార్థి లేఖ రాసి నెలరోజులైనా ఇంత వరకు అధికారులు స్పందించలేదు. ఒక కమిటీని నియమించి జవాబు పత్రాలను దిద్దించి వెంటనే రిజల్ట్ అనౌన్స్ చేస్తే ఆ విద్యార్థి ఉద్యోగం సాధిస్తాడు. అయితే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వీరి నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారుతోంది.

మా పాత్రలేదు...



2010-13 వరకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా పనిచేసి 2014లో రిలీవ్ అయ్యా. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్‌గా ప్రొఫెసర్లు చంద్రశేఖర్, గోవిందరాజులు, భానుమూర్తి ఉన్నారు. ఆ సమయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. అందుకు పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం, వర్సిటీ ఒక కమిటీని నియమించింది. జవాబు పత్రాల రూపకల్పనలో మా పాత్రలేదు. విద్యార్థుల పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. సంబంధిత సబ్జెక్టు మూడుసార్లు బోధించి, ఐదు సంవత్సరాల అనుభవం, అర్హత కలిగిన వారితోనే మూల్యాంకనం చేయిస్తున్నాం. మార్కులు తక్కువగా వస్తే నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చు.

- ప్రొఫెసర్ కేశవరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్

పరిశీలిస్తాం....



పరీక్షల నిర్వహణలో జరుగుతున్న లోపాలను పరిశీలిస్తాం. వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల నుంచి దాదాపు రెండు లక్షలకు పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తుంటారు. అందుకు సంబంధించిన ప్రశ్నపత్రాల రూపకల్పన, జవాబు పత్రాల మూల్యాంకనం, ఫలితాల విడుదల అంశాల్లో జాగరూతగా పనిచేయాల్సివుంది. భవిష్యత్తులో ఇలాంటి లోపాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

- ప్రొఫెసర్ రంగజనార్దన, జేఎన్‌టీయూ వీసీ

విద్యార్థుల భవిష్యత్తును హరిస్తున్నారు



జేఎన్‌టీయూ సర్టిఫికెట్స్‌కు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రత్యేక గుర్తింపుంది. అయితే అక్రమాలకు పాల్పడుతూ నిర్లక్ష్యంగా మూల్యాంకనం చేసి విద్యార్థులను ఫెయిల్‌చేస్తూ వారి భవిష్యత్తును హరిస్తున్నారు. పారదర్శకంగా పనిచేసే అధికారులను వైసీపీ ప్రభుత్వ రాష్ట్రస్థాయి అధికారులు తొక్కిపెడుతున్నారు. వారి అనుచరులకే కీలక పదవులు కట్టబెట్టి అక్రమాల పుట్టగా మార్చేశారు.

- పరశురాం, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

జేఎన్‌టీయూని రోడ్డుకీడుస్తున్నారు



సాంకేతిక విద్యాప్రమాణాలు పెంచి విద్యార్థులకు ఉద్యోగాలను కల్పించాల్సిన వర్సిటీ అధికారులు బాధ్యత మరిచి జేఎన్‌టీయూని రోడ్డుకీడుస్తున్నారు. వర్గపోరు సాగిస్తూ పదవులకోసం పాకులాడే ఆత్రత విధుల్లో చూపడంలేదు. పరీక్షలంటనే భవిష్యత్తును నిర్దేశించే అంశం. పాదర్శకంగా పనిచేస్తేనే ఖచ్చితత్వమైన ఫలితాలు వస్తాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక పరీక్ష ప్రశ్నపత్రాలను లీకుచేసినవారికే అధికారమివ్వడంతో పరీక్షల నిర్వహణ విభాగం గాడితప్పింది.

- వేమన, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు

86,142 మందికి జేఎన్‌టీయూ పట్టాలు

బంగారు పతకాలకు 46 మంది ఎంపిక

వీసీ ప్రొఫెసర్ రంగజనార్దన వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న వీసీ రంగజనార్దన

అనంతపురం సెంట్రల్, జనవరి 4: జేఎన్‌టీయూ పరిధిలో విద్యను పూర్తిచేసిన 86, 142 మంది విద్యార్థులు వారి డిగ్రీ పట్టాలను పుచ్చుకుంటున్నారని వీసీ రంగజనార్దన తెలిపారు. గురువారం జేఎన్‌టీయూ మెకానికల్ ఇంజనీరింగ్ సెమినార్‌హాల్లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించనున్న స్నాతకోత్సవ వేడుకల వివరాలను వీసీ వెల్లడించారు. 2021-22, 2022-23 సంవత్సరాల్లో ఉత్తమ మార్కులు సాధించిన 46 మంది విద్యార్థులు బంగారు పతకాలకు ఎంపికయ్యారన్నారు. స్నాతకోత్సవంలో 1042 మంది డిగ్రీ పట్టాలను పుచ్చుకుంటారని తెలిపారు. పోస్ట్ కాన్వకేషన్ 62, 272 మంది, ప్రీ కాన్వకేషన్ 13,728, మొత్తం 86, 142మంది విద్యార్థులు పట్టాలు పొందుతున్నట్లు వివరించారు. వర్సిటీ 13వ స్నాతకోత్సవానికి చాన్సలర్ హోదాలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరవుతారన్నారు. ఆయన విద్యార్థులకు బంగారు పతకాలు, పట్టాలను ప్రదానం చేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పీఆర్వో డాక్టర్ మారాల రామశేఖరరెడ్డితోపాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

46 మందికి బంగారు పతకాలు

జేఎన్‌టీయూ పరిధిలో బీటెక్, ఎంటెక్, బీ ఫార్మసీ పూర్తిచేసి ఉత్తమ మార్కులు సాధించిన 46 మంది విద్యార్థులు బంగారు పతకాలకు ఎంపికయ్యారు. వీరిలో 2021-22 సంవత్సరానికిగాను 24 మంది, 2022-23 సంవత్సరానికిగాను 22 మంది ఉన్నారు. అనంతపురం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థి దాసరి శాంతి 90.14 శాతం మార్కులు సాధించి ఎనిమిది గోల్డ్‌మెడల్స్ సాధించింది. అదేవిధంగా మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి సాయికుమార్ 88.95 శాతం మార్కులతో 5, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థి మేఘన 86.91శాతం మార్కులతో 4 గోల్డ్‌మెడల్స్ సాధించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి నిర్మిత 88.83శాతం మార్కులతో 3 గోల్డ్‌మెడల్స్‌ను, 88.87 శాతం మార్కులతో వంశీ 3 గోల్డ్‌మెడల్స్‌ను సాధించారు. ఈసీఈ తనూజ 2, కెమికల్ ఉపేంద్రరెడ్డి 2, ఈఈఈ చైతన్య 2, కెమికల్ సుమంత్ 2, ఈఈఈ నిత్యశ్రీ రెండు గోల్డ్‌మెడల్స్ సాధించారు. అదేవిధంగా ఎంటెక్ టాపర్స్‌లో ఈసీఈ సంగీత రెండు మెడల్స్‌ను సాధించింది.

ఐఈఎస్‌లో ఆఫీసర్‌గా ఉద్యోగం సాధిస్తా



ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్(ఐఈఎస్)లో ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించడమే జీవిత లక్ష్యం. మాది పుట్టపర్తి, అమ్మ సావిత్రి, నాన్న నరసప్ప. ప్రైవేట్ సంస్థలో పనిచేస్తారు. ఇద్దరు అక్కలు ఐటీ కంపెనీస్‌లో జాబ్‌చేస్తున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో జేఎన్‌టీయూలో సీటు సాధించి 8 మెడల్స్‌ను సాధించడం గర్వంగా వుంది.

- దాసరి శాంతి, సివిల్ ఇంజనీరింగ్

ఎంఎన్‌సీ ఎండీ కావడమే ధ్యేయం



మల్టీనేషనల్ కంపెనీస్ (ఎంఎన్‌సీ) ఎండీ కావడమే ధ్యేయంగా చదువుతున్నాను. అమ్మ విజయలక్ష్మి, వ్యాసాపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. నాన్న డాక్టర్ రాజశేఖర్, ఎస్కేయూ గోల్డ్ మెడలిస్ట్. పెద్దయక్క లూరు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ముంబై ఐఐఎంలో ఎంబీఏ చదువుతున్నా. అమ్మనాన్నలకు మంచిపేరు తీసుకువస్తా. మూడు గోల్డ్‌మెడల్స్ సాధించడం ఆనందంగా ఉంది.

- దాసరి నిర్మిత, మెకానికల్ ఇంజనీరింగ్

ఐఏఎస్ అవుతా



ఐఏఎస్ అయి ప్రజలకు సేవలందించాలన్నదే నా ధ్యేయం. ప్రస్తుతం బెంగళూరులోని సెంట్రల్ గవర్నమెంట్ అకౌంటెంట్ జనరల్ ఆఫీస్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాను. మాది అనంతపురం. అమ్మ స్వర్ణలత, నాన్న రమణయ్య. హెచ్ఎల్‌సీ సర్కిల్ ఆఫీస్‌లో టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. నాలుగు గోల్డ్‌మెడల్స్ సాధించడం ఆనందంగా ఉంది.

- మేఘన, సివిల్ ఇంజనీరింగ్

కలెక్టర్ అవ్వాలి



సివిల్స్ సాధించి కలెక్టర్ అవ్వాలన్నదే లక్ష్యం. మాది పరిగి మండలం కలువపల్లి. అమ్మ, నాన్న వ్యవసాయదారులు. శ్రీసత్యసాయిబాబ ఆశయాలతో పేదలకు సేవచేయాలన్న అమ్మనాన్న కలను నెరవేరుస్తాను. వ్యవసాయ కుటుంబం నుంచి బీటెక్‌లో 5 గోల్డ్‌మెడల్స్‌ను సాధించడం ఆనందంగావుంది. అమ్మ, నాన్న కష్టపడి చదివించడంతో బంగారు పతకాలు అందుకుంటున్నాను.

- సాయికుమార్, మెకానికల్ ఇంజనీరింగ్

కుదరని ముహూర్తం...

రెండుసార్లు జడ్పీ సమావేశం వాయిదా

అక్రమాలను ప్రశ్నిస్తారనా..? ఆధిపత్యం కోసమా..?

అనంతపురం విద్య, జనవరి 4: జిల్లా సర్వసభ్య సమావేశం మరోసారి వాయిదా పడింది. గత నెల 26న నిర్వహించాలని నిర్ణయించారు. తర్వాత ఈ నెల 5వ తేదీ నిర్వహిస్తామని ప్రకటించారు. శుక్రవారం మీటింగ్ పెట్టాల్సి ఉండగా గురువారం ఉన్నఫలంగా వాయిదా వేశారు. ఈ మేరకు జడ్పీ కార్యాలయం నుంచి అధికారులు మండలాల్లో ఎంపీడీఓ కార్యాలయాలకు ఫోన్లు చేశారు. మరోసారి వాయిదా వేశామని మీ పరిధిలోని సభ్యులకు తెలియజేయాలంటూ చెప్పారు. జడ్పీ పాలకవర్గం సభ్యులకు ఇప్పటికే రెండుసార్లు సమావేశాలు జరిగే తేదీలు చెప్పి మార్చడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. 6 నెలలుగా జడ్పీలో అధికారుల నిర్ణయాలపై, పోకడలపై గుర్రుగా ఉన్న సభ్యులు తమపై దండెత్తుతారని, తమ అక్రమాలను ప్రశ్నిస్తారన్న భయంలోనే జడ్పీ ఉన్నతాధికారులు వాయిదాల పర్వానికి తెరతీశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతనెల 26 నుంచి రెండుసార్లు...

జడ్పీ సర్వసభ్య సమావేశం రెండు సార్లు వాయిదా వేశారు. డిసెంబరు 26న నిర్వహిస్తామంటూ జడ్పీ సీఈఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. 'ఆడుదాం ఆంధ్రా' నిర్వహిస్తోందంటూ సాకుగా చూపి సమావేశాన్ని వాయిదా వేశారు. తిరిగి జనవరి 5న నిర్వహిస్తామంటూ మరోసారి ప్రకటన జారీ చేశారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహించాల్సి ఉంది. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జడ్పీ నుంచి మండలాలకు ఫోన్లు వెళ్లాయి. జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని మరోసారి వాయిదా వేశామని, మండలాల్లోని జడ్పీ జనరల్ బాడీ సభ్యులకు తెలియజేయాలంటూ జడ్పీలోని పలువురు అధికారులు ఎంపీడీఓలకు ఫోన్లు చేసి సమాచారం అందించారు. దీంతో నిర్వహణ తేదీలను పదే పదే ఎందుకు వాయిదా వేయాలంటూ జడ్పీ సభ్యులు మండిపడుతున్నారు. జడ్పీ సర్వసభ్య సమావేశాల నిర్వహణకు 90 రోజుల వ్యవధి ఉండాలి. గత ఏడాది ఆగస్టులో నిర్వహించారు. తిరిగి 90 రోజుల్లోనే నిర్వహించాలన్న నిబంధన ఉన్నా దాన్ని కూడా జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ తుంగలో తొక్కారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వాయిదాలు అందుకేనా..?

తమ అక్రమాలు బయటపడుతాయన్న నెపంతో జడ్పీలోని కొందరు ఉన్నతాధికారులు పదే పదే వాయిదా వేస్తున్నట్లు సమాచారం. గత ఆరు మాసాల కాలంలో కోట్ల రూపాయల బిల్లులను నిబంధనలు తుంగలో తొక్కి చెల్లింపు చేశారు. అదేవిధంగా అనేక అవకతవకలకు తెరలేపారు. అంతేకాకుండా జడ్పీటీసీలకు జడ్పీ నుంచి ఇచ్చే నిధుల వినియోగంపై కూడా స్థానిక సంస్థల నుంచి తీర్మానాలు తేవాలన్న కొత్త నిబంధనను తెరపైకి తీసుకొచ్చారు. దీనిపై కూడా జడ్పీటీసీలు గుర్రుగా ఉన్నారు. తాము కోట్ల రూపాయలు నిధులు జడ్పీ నుంచి తెచ్చుకుంటే జడ్పీ ఉన్నతాధికారుల నిర్ణయాల వల్ల కోల్పోయే ప్రమాదం ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన సమావేశాల్లోనే జడ్పీటీసీలు అధికారులను ఆటాడేశారు. ఇప్పటికీ ఆ సమస్య అలాగే ఉంది. అదేవిధంగా జిల్లాలోని సుమారు 52 సీపీడబ్ల్యూఎస్ స్కీం నిర్వహణకు ఏడాదికి ఒకసారి టెండర్ పిలుస్తారు. 2022-23 ఏడాదికి సంబంధించి టెండర్లు పిలువగా వాటి గడువు ముగిసింది. కొత్తగా 2023-24 ఏడాదికి గత మార్చిలో టెండర్లు పిలవాల్సి ఉండగా పలు కారణాల వల్ల టెండర్లు పిలువలేదు. ఇలాంటి పరిస్థితుల్లో గతంలో ఉన్న కాంట్రాక్టర్లనే కొనసాగించేలా సప్లిమెంటరీ అగ్రిమెంట్ చేస్తారు. అయితే సప్లిమెంటరీ అగ్రిమెంట్‌ను గతంలో జడ్పీలో పనిచేసి సస్పెండ్ అయిన ఓ ఉన్నతాధికారితో ఇప్పటి జడ్పీ ఉన్నతాధికారులు గుట్టుచప్పుడు కాకుండా చేయించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి జడ్పీ ఉన్నతాధికారుల అక్రమాలను తూర్పారబట్టేందుకు జడ్పీటీసీలు, జడ్పీ పాలకవర్గం అస్త్రాలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎదురుదాడి నుంచి బయపడేందుకు పదే పదే సమావేశాలను వాయిదా వేస్తున్నారన్న విమర్శాలూ వినిపిస్తున్నాయి.

సీకే పల్లి పోలీస్ స్టేషన్‌పై ఏసీబీ దాడులు

దంపతుల వివాదంలో లంచం డిమాండ్ చేసిన సీఐ, ఎస్ఐ

చెన్నేకొత్తపల్లి, జనవరి 4: కులాంతర వివాహం చేసుకున్నవారి మధ్య విభేదాలు వచ్చాయి. భర్త వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు.. చట్టబద్ధంగా వ్యవహరించాల్సిందిపోయి బేరసారాలకు దిగారు. డబ్బులు ఇస్తే కేసు లేకుండా చేస్తామని అన్నారు. అంత సొమ్ము ఇచ్చుకోలేనని నిందితుడు అన్నా వినిపించుకోలేదు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. లంచం తీసుకునే వేదికగా చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్ మారింది. అక్కడ ఏసీబీ అధికారులు వలపన్నిన విషయం తెలుసుకుని.. రామగిరి సీఐ చిన్నగౌస్ పారిపోయారు. కనగనాపల్లి ఎస్ఐ హనుమంతరెడ్డి పారిపోతూ పట్టుబడ్డాడు.

రూ.3 లక్షలు డిమాండ్: దాడుల వివరాలను ఏసీబీ అనంతపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకటాద్రి విలేకరులకు వివరించారు. కనగానపల్లి మండలం తగరకుంటకు చెందిన వడ్డే నరేశ్, అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ఏడాది క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. కొంతకాలానికి వారి మధ్య విభేదాలు తలెత్తాయి. తల్లిదండ్రులతో కలిసి నరేశ్‌పై ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నరేశ్‌పై గత ఏడాది డిసెంబరు 22న కేసు నమోదైంది. ఈ కేసు కొట్టేసేందుకు రూ.3 లక్షలు ఇవ్వాలని రామగిరి సీఐ, కనగానపల్లి ఎస్ఐ డిమాండ్ చేశారు. బాధితుడు అంత ఇచ్చుకోలేనని చెప్పినా వినిపించుకోలేదు. ఈ వ్యవహారం ఏసీబీ వరకూ వెళ్లింది. ఏసీబీ అధికారుల సూచన మేరకు లంచం ఇచ్చేందుకు నరేశ్ చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు గురువారం మధ్యాహ్నం చేరుకున్నాడు. సీఐ, ఎస్ఐ డబ్బులు వెంటనే తీసుకోకుండా కొన్ని గంటల పాటు వేచిచూశారు. ఆ తరువాత లంచం తీసుకోవడానికి ప్రయత్నం చేస్తుండగా ఏసీబీ అధికారుల వాహనం స్టేషన్‌లోకి వెళ్లింది. సీఐ చిన్నగౌస్ పసిగట్టి పారిపోయాడు. కనగానపల్లి ఎస్ఐ పారిపోతుండగా ఏసీబీ అధికారులు వెంబడించి కనగానపల్లి పోలీస్‌స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐని విచారిస్తున్నామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

వైసీపీ నాయకుల ఫిర్యాదు..?: సీఐ చిన్నగౌస్ అవినీతికి పాల్పడుతున్నారని మూడు మండలాల వైసీపీ నాయకులు డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మొహర్రం వేడుకలకు అనుమతి ఇచ్చేందుకు ప్రజల నుంచి రూ.10 లక్షలు, కేఎస్‌పాళ్యంలో ఓ మహిళ ఆత్మహత్య కేసులో రూ.లక్ష తీసుకున్నట్లు ఫిర్యాదు వెళ్లినట్లు సమాచారం. చెన్నేకొత్తపల్లిలో అన్నదమ్ముల మధ్య భూ వివాదం కేసులో సుమారు రూ.2 కోట్లు లంచం తీసుకున్నారని కూడా వైసీపీ నాయకులు డీజీపీకి ఫిర్యాదు చేశారని తెలిసింది. సీకే పల్లిలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వివాదాన్ని ఆసరగా చేసుకుని, ఇరువర్గాల నుంచి రూ.5 లక్షలు చొప్పున లంచం డిమాండ్ చేశారని, డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించిన వ్యక్తిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని ఆరోపణలు ఉన్నాయి.

సీఐ కదలికలపై నిఘా: సీఐ చిన్నగౌస్ పారిపోవడంతో ఏసీబీ అధికారులు ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. బుక్కపట్నం సంఘటన దృష్టిలో ఉంచుకుని సీఐ కదలికలపై రామగిరి ఎస్ఐ ద్వారా నిఘా పెట్టినట్లు సమాచారం.

గ్రామాలకు పూర్వవైభవం తెస్తాం

సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూషణ్

అనంతపురం అర్బన్, జనవరి 4 : టీడీపీ అధికారంలోకి రాగానే గ్రామాలకు పూర్వ వైభవం తెస్తామని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూషణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు సర్పంచుల హక్కులను కాపాడటంతో పాటు గ్రామాలకు పూర్వ వైభవం తెస్తామని హామీ ఇవ్వడం శుభపరిణామమన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా సర్పంచులకే బదిలీ చేసేలా రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ ఏర్పాటు చేసి సర్పంచులకు విధులు, నిధులు గౌరవం తిరిగి కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం సర్పంచులు కృషి చేయాలని ఆయన కోరారు.

పోటీతత్వాన్ని ఎదుర్కొనేలా క్రీడలు

సాంకేతిక విద్య కమిషనర్ నాగరాణి


పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ నాగరాణి

అనంతపురం సెంట్రల్, జనవరి 4: విద్యార్థుల్లో పోటీతత్వాన్ని ఎదుర్కొనేలా మానసిక ధైర్యం పెంపొందించడానికే క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. గురువారం అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ (ఐపీఎస్‌జీఎం) నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన క్రీడాపోటీలకు నాగరాణితో పాటు కలెక్టర్ గౌతమి, ఆర్జేడీలు నిర్మల్‌కుమార్ ప్రియ, సత్యనారాయణమూర్తి, సెక్రెటరీ రమణబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శాంతి కపోతాలను ఎగురవేసి క్రీడా జ్యోతిని వెలిగించి ఈ వేడుకలను ప్రారంభించిన కమిషనర్ మాట్లాడారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో అర్హతసాధించిన 1400 మంది క్రీడాకారులకు 13 క్రీడాంశాలు, ఆరు ఆటల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలు శనివారం వరకు కొనసాగుతాయన్నారు. అనంతరం క్రీడాకారులతో గౌరవ వందనం స్వీకరించి పోటీలను తిలకించారు. కార్యక్రంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజ, ఎంపీ తలారి రంగయ్య, సర్పంచ్ ఉదయ్ శంకర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, జనవరి 4: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పక్కాగా అమలు చేయాలని, ఇందుకు తమవంతు సహకారం ఉంటుందని కలెక్టరు గౌతమి, ఎస్పీ అన్బురాజన్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు క్షేత్రస్థాయిలో ఎక్కడైనా ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న తమదృష్టికి తీసుకురావాలన్నారు. ఎస్టీ తండాల అభివృద్ధికి ఆయాశాఖల అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో 76 కేసులు అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉండగా 537 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ కొన్ని సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయని, అక్కడ పరిస్థితులను తమదృష్టికి తీసుకొస్తే అక్కడ పోలీస్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేస్తామని అన్నారు. సమావేశంలో జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయిత్రీదేవి, ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, శ్రీనివాసరెడ్డి, రాణిసుష్మిత, అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులపై చిన్నచూపు : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై చిన్నచూపు చూస్తున్నారని ఎస్సీ ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యులు యల్లన్న, దాస్, ఇమామ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. 2018 నుంచి ఇప్పటివరకు అనేక కేసులు విచారణకు నోచుకోవడంలేదనీ, దీంతో బాధితులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. ఆ కేసులను త్వరగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బ్యాక్‌టాగ్ పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో శింగనమల, రాప్తాడు, యాడికి, బ్రహ్మసముద్రం మండలాల్లో శ్మశాన వాటికలను కూడా ఆక్రమించుకుంటున్నారని, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

7న జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

అనంతపురం కల్చరల్, జనవరి 4: జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉరవకొండలో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా కార్యదర్శి కెంచా లక్ష్మీనారాయణ, ఉరవకొండ మండల జేవీవీ కన్వీనర్ వెంకట్ గురువారం సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఉరవకొండలోని కరిబసవయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ సంబరాలు నిర్వహిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా 32 మండలాలు, ఐదు మున్సిపాలిటీలు, ఒక నగరపాలకసంస్థ పరిధిల్లో మండల స్థాయిల్లో, డివిజన్ స్థాయిల్లో ప్రథమ స్థానంలో గెలుపొందిన 180 మందికిపైగా విద్యార్థులు జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

విద్యార్థి అదృశ్యం


నరసింహ

గార్లదిన్నె, జనవరి 4: గార్లదిన్నెకు చెందిన వడ్డే ఎర్రిస్వామి, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు విద్యార్థి వడ్డే నరసింహ రెండ్రోజులుగా కనిపించడం లేదు. అతను అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల రెండో తేదీన కళాశాలకు వెళ్లిన అతను సాయంత్రం ఇంటికి వచ్చాడు. సెల్‌ఫోన్, పుస్తకాలు ఇంట్లో పెట్టి బయటకు వెళ్లిన అతను తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో అతని తల్లిదండ్రులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆగ్రోస్ ఇన్‌చార్జి ఆర్‌ఎంగా విద్యాసాగర్



అనంతపురం అర్బన్, జనవరి 4: ఆగ్రోస్ ఇన్‌చార్జి ఆర్‌ఎంగా విద్యాసాగర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్‌ఎం చంద్రబాబు గత నెల ఉద్యోగ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో చిత్తూరు ఆగ్రోస్ ఆర్‌ఎంగా పనిచేస్తున్న విద్యాసాగర్‌కు జిల్లా ఆగ్రోస్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

కొవిడ్ కేసులు నిల్

అనంతపురం టౌన్ జనవరి 4: జిల్లా ఆస్పత్రిలో గురువారం పదిమంది అనుమానితులకు కొవిడ్ పరీక్షలు నిర్వహించామని, అందరికీ నెగిటివ్ వచ్చిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. దీంతో కొత్తగా పాజిటివ్ కేసులు నమోదు కాలేదన్నారు.

42 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

అనంతపురం న్యూటౌన్, జనవరి 4: స్థానిక తపోవనం సర్కిల్‌లో ఎస్ఐ జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. అశోక్‌లైల్యాండ్ లారీలో (ఏపీ39టీజెడ్6616) అక్రమంగా తరలిస్తున్న 42 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాలుగురిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఏఈఈ కుళ్లాయిరెడ్డి, సీఎస్‌డీటీ మహబుబ్‌బాషా పాల్గొన్నారు.

మద్యం విక్రేతల అరెస్ట్

అనంతపురం క్రైం: జిల్లాలోని బొమ్మనహాల్, కంబదూరు, అనంతపురం ప్రాంతాల్లో పోలీసులు ముగ్గురు మద్యం విక్రేతలను అరెస్ట్ చేశారు. వారి నుంచి 430 టెట్రా ప్యాకెట్లు, 36 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు

బుక్కరాయసముద్రం, జనవరి 4: మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో అయోధ్య రాముని అక్షింతలను గురువారం ఊరేగించారు. గ్రామంలోని రామాలయం నుంచి భజన చేస్తూ గ్రామంలోని పురవీధుల గుండా ఈ ఊరేగింపు నిర్వహించారు. ప్రతి ఇంటికి ఆ అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గం రైతు విభాగం జిల్లా ఉపాధ్యాక్షుడు మల్లిఖార్జునరెడ్డి , శ్రీకాంత్‌రెడ్డి, కుళ్లాయరెడ్డి పాల్గొన్నారు.


చెన్నంపల్లిలో అక్షింతలు పంపిణీ చేస్తున్న గ్రామస్థులు

మూడు నెలల్లో అధికారంలోకి టీడీపీ

దొంగ ఓట్లతో గెలవాలన్న వైసీపీని అడ్డుకుందాం : మాజీ మంత్రి పరిటాల సునీత


టీడీపీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురంరూరల్, జనవరి 4: మరో మూడ నెలల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాబోతోందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మండలంలోని నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతి ఒక్కరూ సీరియస్‌గా పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇప్పటికే వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, దీంతో తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయమని అన్నారు. దొంగ ఓట్లతో గెలవాలని వైసీపీ నాయకులు యత్నిస్తున్నారని, దీన్ని ఐకమత్యంతో అందరూ అడ్డుకోవాలని అన్నారు. ఓటర్ వెరిఫికేషన్‌పై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. ఒక్క ఓటు విషయంలో కూడా పొరపాటు జరగకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికల వరకు అందరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ రిజిస్ట్రేషన్స్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. మూడునెలలు కష్టపడితే అధికారం తమదేనన్నారు. కార్యక్రమంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బీఎల్‌ఏలు, బూత్ కన్వీనర్లు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

జయహో బీసీ సమావేశానికి జిల్లా నాయకులు


మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులుతో టీడీపీ బీసీ సెల్ నాయకులు, సభలో మాట్లాడుతున్న శివబాల

అనంతపురం అర్బన్, జనవరి 4: టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జయహో బీసీ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా హాజరైన ఈ సమావేశానికి జిల్లా నుంచి పలువురు నేతలు తరలి వెళ్లారు. సమావేశానికి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, నాయకులు వెంకటశివుడు యాదవ్, ఆవుల కృష్ణయ్య, సిమెంట్ పోలన్న, గోరకాటి వెంకటేసు, బ్యాళ్ల నాగేంద్ర హాజరయ్యారు. సభలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివబాల మాట్లాడుతూ.. బీసీలకు అన్యాయం చేయడమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. అనేక మంది బీసీలకు రాజకీయ భవిష్యత్తు ఇచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు.

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం

రామగిరి, జనవరి 4: చంద్రబాబు నాయుడును సీఎంగా చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణ చౌదరి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎంసీపల్లి పంచాయతీలో తిమ్మాపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, మాజీ ఎంపీపీ పరంధామయాదవ్, మాజీ సర్పంచ్ ముత్యాలు, గంగాదర్, తిమ్మాపురం పరంధామ పాల్గొన్నారు.


తిమ్మాపురంలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి

ఘనంగా లూయి బ్రెయిలీ జయంతి

చెన్నేకొత్తపల్లి, జనవరి 4: అంధుల లిపి సృష్టికర్త లూయి బ్రెయిలీ 214వ జయంతిని గురువారం చెన్నేకొత్తపల్లిలో ఘనంగా నిర్వహించారు. టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సహకారంతో ప్రతిభా వికలాంగుల సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామగిరి, రొద్దం, చెన్నేకొత్తపల్లి మండలాల నుంచి వచ్చిన అంధులు, దివ్యాంగులు స్థానిక సీఆర్‌సీ కేంద్రం నుంచి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురు అంధులకు ఎలక్ట్రిక్ చేతికర్రలు అందజేశారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ఇందులో స్టేట్‌బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మారుతీరెడ్డి, చిగురు మేనేజర్ శ్రీకాంత్, కో-ఆర్డినేటర్ రామన్న, మిలిత కో-ఆర్డినేటర్ జయశ్రీ, ప్రతిభా సొసైటి అధ్యక్షుడు నాగరాజు, సీఈఓ నరసింహులు పాల్గొన్నారు.

అంధులకు చేతికర్రల పంపిణీ

అనంతపురం కల్చరల్: లూయిస్ బ్రెయిల్ 215వ జయంతిని పురస్కరించుకుని సాయి ట్రస్టు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అశోక్‌నగర్‌లోని ఆపిల్ ఫంక్షన్ హాల్‌లో అందులకు చేతికర్రల పంపిణీ చేశారు. తమిళనాడులోని కట్పాడులో ప్రత్యేకంగా తయారు చేయించి తెప్పించిన చేతికర్రలను దాదాపు 59 మందికి సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకుడు సురేష్ నారాయణ, వరలక్ష్మి, సాయి ట్రస్టు సభ్యులు నారాయణనాయక్, రాఘవేంద్ర పాల్గొన్నారు.


సీకేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉపాధి పనులు కల్పించాలని ఆందోళన


ఏపీఓతో వాగ్వాదం చేస్తున్న ఉపాధి కూలీలు

బుక్కరాయసముద్రం, జనవరి 4: మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలని ఆ గ్రామానికి చెందిన పలువురు కూలీలు ఆందోళన చేపట్టారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏపీఓ పోలేరయ్య, ఎంపీడీఓ తేజోత్స్నను కలిసి విజ్ఞప్తి చేశారు. చెన్నంపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ కేవలం కొంత మందికి మాత్రమే పనులు కల్పిస్తున్నారని, నిజమైన కూలీలు అడిగితే.. పట్టించుకోవడం లేదని అన్నారు. టీడీపీ వారికి పనులు కల్పించబోమని బహిరంగంగా చెబుతున్నారని ఏపీడీకు ఫిర్యాదు చేశారు. వీటితో పాటు గతంలో తాము చేసిన పనులకు డబ్బులు ఇవ్వలేదని మండిపడ్డారు. వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఏపీఓ అన్నారు.

జేఎన్‌టీయూలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూలో శనివారం నిర్వహించనున్న స్నాతకోత్సవ వేడుకలకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ వస్తుండటంతో కట్టుదిట్ట ఏర్పాట్లు చేస్తున్నారు. వర్సిటీ ప్రాంగణాన్ని ప్రభుత్వ అధికారులు అణుఅణువునా పరిశీలిస్తున్నారు. గురువారం ఆర్డీఓ రాణి సుష్మిత గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. వర్సిటీ ఐసీఎస్ డైరెక్టర్ విశాలితో కలిసి స్నాతకోత్సవ వేడుకలు నిర్వహించే ఎన్‌టీ రామారావు ఆడిటోరియం, అలుమ్ని గెస్ట్ హౌస్ ప్రాంతాలను తనిఖీలు చేశారు.

ఎస్కేయూలో వైద్యశిబిరం


శిబిరంలో పాల్గొన్న ప్రముఖులు

అనంతపురం,సెంట్రల్, జనవరి 4: ఎస్కే. యూనివర్శిటీలో కంటి, దంత వైద్య శిబిరం, చెక్కర వ్యాధిగ్రస్తులకు పరీక్షల శిబిరాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బంది దాదాపు 400 మందికి ఇందులో కంటి, దంత, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్కేయూ రిజిష్టర్ ఆచార్య వి.లక్ష్మయ్య, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సత్య సౌమ్య, కో-ఆర్డినేటర్ మురళీధర్‌రావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్ , కంటి వైద్య నిపుణులు అక్బర్ సాహెబ్, రాణి, ఐశ్వర్య, దంత వైద్య నిపుణులు మౌనిక రెడ్డి పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 4: నిరుద్యోగ యువతీ, యువకులకు కడపలోని ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 35 రోజుల పాటు కంప్యూటర్ స్కిల్స్, ట్యాలీ, రిటైల్ కోర్సుల్లో ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తామని కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ గురువారం తెలిపారు. 18-26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి.. పదోతరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. శిక్షణా కాలంలో ఉచితంగా వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై నగరాల్లో ఎంఎన్‌సీ కంపెనీలలో ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 9000487423 నంబరులో సంప్రదించాలని కోరారు.

పదోరోజుకు చేరిన కార్మికుల సమ్మె

అనంతపురం క్రైం, జనవరి 4: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారానికి పదో రోజుకు చేరుకుంది. అనంతపురం నగరంలో సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్లు, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసనలు వ్యక్తం చేశారు. అనంతపురంలో సీఐటీయు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌ల రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, ఏటీఎం నాగరాజుల ఆధ్వర్యంలో వంటావార్పుతో కార్మికులు భోజనం చేశారు. అనంతరం ఇంజనీరింగ్ కార్మికులతో కలిసి అనంతపు రానికి నీటి సరఫరా చేసే క్రొరకొల్లు డ్యామ్ వద్ద రెండు గంటలపాటు నీటి సరఫరాను బంద్ చేశారు. అక్కడ కూడేరు పోలీసులు అడ్డుకు న్నారు. అనంతరం కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి ఆధ్వర్యంలో కార్మికులు నగరపాలిక ఆవరణంలో చెత్త వేసి నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. రామ్‌నగర్ ఫ్లైఓవర్‌పై శుభ్రం చేస్తున్న కార్మికులను సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకుని, పరకలు లాక్కున్నారు. దీంతో నగరపాలిక అడిషనల్ కమిషనర్ పోలీసులను పిలుచుకొని అక్కడికొచ్చారు. తామేం తప్పు చేశామని పోలీసులను పిలుచుకొచ్చారంటూ అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ ముర్తుజా, నల్లప్ప, మల్లికార్జున, ఓబుళపతి, ఏఐటీయూసీ నాయకులు మల్లికార్జున, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు


పరిటాల రవీంద్రఘాట్ వద్ద పరిటాల సునీత, శ్రీరామ్

పరిటాల రవీంద్రకు నివాళి

రామగిరి, జనవరి 4: టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పట్టణంలో గురువారం తలపెట్టిన ప్రజాచైతన్య పాదయాత్రకు వెళ్తూ వెంకటాపురంలో తన తండ్రి పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇలవేల్పు యల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజాచైతన్యయాత్ర విజయవంతంగా సాగాలని అమ్మవారిని ప్రార్థించారు. పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రి పరిటాల సునీత పాల్గొన్నారు.

భూహక్కు పత్రాలతో ప్రయోజనం శూన్యం


శాశ్వత భూహక్కు పత్రాలతో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

శింగనమల, జనవరి 4: భూసర్వే పేరుతో రూ.లక్షలు ఖర్చు చేసి ఇచ్చిన జగనన్న భూహక్కు పత్రాలతో రైతులకు ఎలాంటి ఉపయోగమూ లేదని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు తరిమెల రామాంజినేయులు విమర్శించారు. గురువారం కొరివిపల్లి సచివాలయం వద్ద జగనన్న భూహక్కుల పత్రాలను దగ్ధం చేసిన ఆయన మాట్లాడారు. ఈ సర్వేలతో జగన్‌రెడ్డి రైతుల మధ్య చిచ్చు పెడుతున్నారని, గ్రామాల్లో అనేక గొడవలు జరుగుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో లక్ష్మీరంగయ్య, నాగరాజు, రాజారాం, శ్రీరాములు, ఆదినారాయణ, రామదాసు, మునయ్య పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా తిరుప్పావై సేవ



అనంతపురం కల్చరల్, జనవరి 4: మార్గశిర శుద్ధ అష్టమిని పురస్కరించుకుని గురువారం పాతూరు తిలక్‌రోడ్డులోని కోదండ రామాలయంలో తిరుప్పావై సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి తిరుప్పావై సేవ నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితుడు శ్రీనాథ్, ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు మైనార్టీలకు కేటాయించాలి


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ సంఘాల నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 4: రానున్న ఎన్నికల్లో అనంతపురం ఎంపీ, అర్బన్ ఎమ్మెల్యే స్థానాలు మైనార్టీలకు కేటాయించాలని మైనార్టీ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘాల నాయకులు నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో టిప్పు అభిమాన సంఘం అధ్యక్షుడు జాకీర్, అమ్మ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్షా, హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు షబ్బీర్ మాట్లాడారు. మైనార్టీలకు అవకాశం కల్పిస్తే అందరూ ఐకమత్యంతో అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో మాబాషా, రహంతుల్లా, ముక్తియార్, జహంగీర్ బాష, అమీర్ బాష, సద్దాం, మహిళా నాయకురాళ్లు జైబున్ పాల్గొన్నారు.

అనంత బాలోత్సవాలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫివుల్లా

అనంతపురం కల్చరల్, జనవరి 4: అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వచ్చే నెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించే నాల్గో అనంత బాలోత్సవంలో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫీవుల్లా పిలుపునిచ్చారు. గురువారం స్థానిక క్రీసెంట్ స్కూల్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థుల్లోని సృజనాత్మకత, ప్రతిభను వెలికితీయడానికే బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ కోశాధికారి జిలాన్, ఆర్ట్స్ కళాశాల లెక్చరర్ పల్లవి, కార్యవర్గ సభ్యులు శ్యామలమ్మ, రాజేశ్వరి, రామాంజినమ్మ, రియాజుద్దీన్, భీమేష్, సోము పాల్గొన్నారు.

రోడ్డు నియమాలపై అవగాహన

గార్లదిన్నె : రోడ్డు నియమాలు, ప్రమాదాలపై ఎస్ఐ సాగర్ ఆధ్వర్యంలో పలువురు ఆర్టీటీ కళాకారులు మండలంలోని కల్లూరు గ్రామం నీలం సంజీవరెడ్డి సర్కిల్లో పాట రూపంలో గురువారం అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడు తూ... వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్లలో మాట్లాడరాదన్నారు.

భక్తిశ్రద్ధలతో కాలభైరవాష్టమి పూజలు

అనంతపురం కల్చరల్, జనవరి 4: హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథస్వామి దేవాలయంలో గురువారం కాలభైర వాష్టమి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఆవరణంలో శ్రీచక్రసహిత అష్టకాల భైరవస్వామి మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మఠం బసవరాజు, భక్తులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీ

శింగనమల, జనవరి 4: మండలంలోని లోలూరు క్రాస్‌లోని భాస్కర్ ఫర్టిలైజర్స్‌లో జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎం.రవి గురువారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయ అధికారులు శ్రీకాత్, అన్వేష్ కుమార్ ఉన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: అంగన్‌వాడీలు తలపెట్టిన సమ్మె గురువారానికి 24వ రోజుకు చేరుకుంది. చెన్నేకొత్తపల్లిలో అంగన్‌వాడీలు నిరసన దీక్షను కొనసాగించారు. శింగనమల, గార్లదిన్నెలో అంగన్‌వాడీల నిరసనలో జిల్లా అంగన్వాడీల వర్కర్ల కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు. విధులకు రాని అంగన్వాడీలపై శాఖ పరమైన చర్యలు తప్పవని పాలకులు, అధికారులు బెదిరించినా భయపడే ప్రసక్తి లేదని శింగనమల తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ఉరితాళ్లు బిగించుకుంటూ నిరసన వ్యక్తం చేశారు. రామగిరిలోనూ అంగన్‌వాడీలు నిరసన కొనసాగించారు.


శింగనమలలో మెడకు ఉరితాళ్లతో అంగన్‌వాడీల నిరసన

జాబ్ క్యాలెండర్ హామీ ఏమైంది జగన్?


మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు


ఉరవకొండ, జనవరి 4: ఏటా జనవరిలో జ్యాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఇచ్చిన హామీని సీఎం జగన్ గాలికి వదిలేశాడని టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు విమర్శించారు. పట్టణంలో గురువారం ఆ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యోగాలను భర్తీ చేయాలంటూ ఆందోళన చేపట్టారు. స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయం నుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి నిరసన తెలిపారు. భిక్షాటన చేశారు. అనంతపురం- గుంతకల్లు రహదారిపై మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. జాబ్ కావాలి అంటే బాబు రావాలి, సైకో జగన్ పోవాలంటూ నినాదాలు చేశారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ప్యారంభరత్, కుమార్‌స్వామి, సుధాకర్, ప్రశాంత్, మనోజ్‌కుమార్, తెలుగు యువత నాయకులు మణిచౌదరి, వన్నూరుస్వామి, పెద్దన్న, పల్లా హరి, విజయ్, చంద్ర, బెస్త హరి, నూర్, భీమేష్ పాల్గొన్నారు.

జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటన


వృద్ధుల సమస్యలు వింటున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి4: పట్టణ, రూరల్ ప్రాంతాల్లో గురువారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. పట్టణంలోని వడ్లపాలెం, ఆసుపత్రిపాలెం, సున్నపుగేరి, మండలంలోని అయ్యవారిపల్లిలో ఆయన పర్యటించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించి పార్టీ అధికారంలోకి వస్తే వాటన్నింటిని అమలుచేస్తామని తెలిపారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక నేతలను కలుసుకొని రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అయ్యవారిపల్లి గ్రామంలో వృద్ధుల సమస్యలను విన్న జేసీ వాటి పరిష్కారం కోసం కృషిచేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో కలిసికట్టుగా పార్టీ గెలుపుకోసం పనిచేయాలని ఆయన కోరారు.

పింఛన్ల పంపిణీ మరింత ఆలస్యం


సోషల్ మీడియాలో అధికారులు పోస్టు చేసిన సమాచారం

యాడికి, జనవరి 4: మండలంలో పింఛన్ సొమ్ము కోసం లబ్ధిదారులకు మరి కొన్ని రోజులు నిరీక్షణ తప్పేటట్లు లేదు. ఇందుకు కారణం మండలానికి సంబంధించిన పింఛన్ డబ్బులు అధికారుల చేతికి ఇంకా రానట్లు చర్చించుకుంటున్నారు. మండలవ్యాప్తంగా 8123మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. రూ.2.441 కోట్లను పంపిణీ చేయాల్సి ఉంది. గురువారం పింఛన్ డబ్బులు డ్రా చేయడానికి బ్యాంక్‌లకు వెళ్లిన అధికారులు డబ్బులు జమ కాకపోవడంతో వెనుదిరిగి వచ్చినట్లు సమాచారం. గురువారం పింఛన్ డబ్బులు వస్తాయని శుక్రవారం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు ఉత్తర్వులు పంపించారు. పెన్షన్ సొమ్ము మంజూరు కాకపోవడంతో పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు సోషల్‌మీడియా ద్వారా సమాచారాన్ని పంపారు.

బొమ్మ మార్చి మోసం చేయాలనుకుంటున్న సీఎం


మాట్లాడుతున్న సందిరెడ్డి శ్రీనివాసులు

రాయదుర్గం, జనవరి 4: తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.వేల కోట్లు సంపాదించిన జగన్ ఎన్నికల్లో బొమ్మను మార్చి మరోసారి మోసం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు ధ్వజమెత్తారు. బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు పార్లమెంటరీ ఇన్‌చార్జి చిరంజీవిరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైన్స్, వైన్స్‌తో పాటు అన్ని రంగాలను దోపిడీ కోసం వినియోగించుకున్న ముఖ్యమంత్రి జగన్ అన్నారు. వేల కోట్ల నుంచి లక్షల కోట్లకు అక్రమ సంపాదన నింపుకుని ప్రజల సంక్షేమాన్ని విస్మరించి దోపిడీనే ప్రధాన పనిగా పెట్టుకున్నాడన్నారు. రాష్ట్రంలో ఉన్న తన ఎమ్మెల్యేల స్థానాలను మార్పులు చేసినంత మాత్రాన మళ్లీ అధికారంలోకి వస్తాననుకోవడం భ్రమ అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రతి గ్రామంలో సాగుతోందన్నారు. జిల్లా కార్యదర్శి నాని, జిల్లా కన్వీనర్‌గా ఎంసీ శ్రీనివాస్, కో కన్వీనర్‌గా భీమసేన, మండల కన్వీనర్ రామన్నచౌదరి, గుమ్మడి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

'జగన్‌ను నమ్మడం ఎలా?'

బొమ్మనహాళ్, జనవరి 4: వ్యవసాయ మోటార్లు ఉన్న రైతులు ఆధార్, బ్యాంక్ ఖాతాల వివరాలు ఎందుకోసం అని తెలుగురైతు నియోజకవర్గం అధ్యక్షులు ఎర్రగుంట్ల వెంకటేశులు ప్రశ్నించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ అధికారులు వ్యవసాయ మోటార్లు ఉన్న రైతులు సబ్సిడీ విద్యుత్ అందాలంటే బ్యాంక్ ఖాతాలు, ఆధార్ కార్డులు ఇవ్వాలని, లేకపోతే వారు ఇచ్చే పత్రాల్లో సంతకం చేయాలని ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయానికి పగటిపూట 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు విడతలుగా ఇస్తున్నారని ఆరోపించారు.

అంగన్‌వాడీల సమస్యలు కనబడలేదా..?

● టీడీపీ నాయకుడు పెరుమాళ్ల జీవానందరెడ్డి


అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావంగా దీక్ష చేపట్టిన పెరుమాళ్ల జీవానందరెడ్డి

పామిడి, జనవరి 4: రాష్ట్రంలో అంగన్‌వాడీల సమస్యలు సీఎం జగన్‌కు వినపడలేదా.. కనపడలేదా..? అని టీడీపీ నాయకులు, పీజేఆర్ సోషల్ సర్వీస్ ట్రస్టు చైర్మన్ పెరుమాళ్ల జీవానందరెడ్డి ఎద్దేవా చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 24వ రోజుకు చేరుకుంది. సమ్మెకు జీవానందరెడ్డి సంఘీభావం తెలియజేస్తూ దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే పాదయాత్రలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలన్నారు. అంగన్‌వాడీల న్యాయబద్ధమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం మండల కార్యదర్శి మల్లేష్, టీడీపీ నాయకులు మారుతి వరప్రసాద్‌రెడ్డి, మున్నా, సంజీవ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదాం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమా


కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఉమామహేశ్వరనాయుడు


కరపత్రాలను పంచుతున్న ఉన్నం హనుమంతరాయచౌదరి

కళ్యాణదుర్గం జనవరి 4: రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసి భ్రష్టు పట్టించిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు అన్నారు. గురువారం కంబదూరు మండల మర్రిమాకులపల్లిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులు ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచుతూ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఆయన మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో దోపిడీ, అక్రమాలు, అవినీతి, దౌర్జన్యాలు కనిపిస్తున్నాయే గానీ అవినీతి పూర్తిగా శూన్యంగా మారిందన్నారు. రాష్ట్రంలో వైసీపీ పాలనపై ప్రతి ఒక్కరు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, ఈప్రభుత్వం భూస్థాపితం కావడం ఖాయమన్నారు. అనంతరం మర్రిమాకులపల్లికు చెందిన చిన్నంపల్లి అజ్జప్ప కుమారుడు 9వ వార్డు మెంబర్ చిన్నంపల్లి ఈరణ్ణ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ఉమామహేశ్వరనాయుడు పరామర్శించారు. చంద్రన్న స్ఫూర్తితో ఉమన్న సాయం కింద రూ. 5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. పార్టీ అండగా వుంటూ బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని అభయమిచ్చారు.

మహిళాభివృద్ధే టీడీపీ ధ్యేయం

కళ్యాణదుర్గం: మహిళాభివృద్ధే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి అన్నారు. గురువారం దానంపల్లిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని కడవకల్లు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. టీడీపీ మాజీ మండల కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, గోవర్ధన్‌రాజు, సోము, పెద్దయ్య, ఆదినారాయణరెడ్డి, రామాంజనేయులు, భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి కార్మికులకు అండగా పోరాటం చేస్తాం

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు


కార్మికులతో చర్చిస్తున్న ఓబులు

కళ్యాణదుర్గం, జనవరి 4: శ్రీరామిరెడ్డి కార్మికులకు వేతనాలు మంజూరు చేయాలంటూ నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకుండా చోద్యం చూస్తున్నారని, శ్రీరామిరెడ్డి కార్మికులకు అండగా వుంటూ పోరాటం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు అన్నారు. గురువారం కళ్యాణదుర్గం శ్రీరామిరెడ్డి పంపుహౌస్ వద్ద నాలుగు రోజులుగా వేతన బకాయిల కోసం నిరసనలు చేస్తున్న కార్మికులను ఓబులు కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఐదు నెలల నుంచి కార్మికులకు జీతాలు మంజూరు చేయకపోతే కుటుంబాలు ఎలా పోషించుకోవాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో ఈ పథకం కింద 225 మంది కార్మికులు పని చేస్తున్నారని, వారందరికీ జీతాలు మంజూరు చేయకపోగా అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యపు ధోరణి అవలంబిస్తున్నారన్నారు. ఏ ఒక్కరు అధైర్యపడకండని జిల్లా కలెక్టర్‌తో చర్చించి వెంటనే జీతాలు మంజూరయ్యేలా చూస్తామని కార్మికులకు ఆయన హామీ ఇచ్చారు.

కణేకల్లు: కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య వైఖరి వహిస్తోందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు ఓబులు అన్నారు. మండలంలోని ఆలూరు పంప్‌హౌస్ వద్ద శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం వర్కర్స్ చేస్తున్న ఆందోళనకు ఆయన సంఘీభావం తెలిపారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలు, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు, మున్సిపాలిటీ కార్మికులతో పాటు శ్రీరామిరెడ్డి వర్కర్స్ గత కొన్ని రోజులుగా వివిధ రూపాలలో ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించకపోతే త్వరలోనే ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. సీఐటీయూ మండల నాయకులు కోరి నాగరాజు పాల్గొన్నారు.

ముస్లింల ఆత్మీయ సదస్సుకు తరలిరండి

గుంతకల్లు, జనవరి 4: పట్టణంలో 8వ తేదీన నిర్వహించనున్న ముస్లింల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని మాజీ శాసనసభ్యుడు ఆర్ జితేంద్రగౌడు ప్రకటనలో పిలుపునిచ్చారు. స్థానిక పోర్టర్స్‌లైన్ దర్గా వద్ద ఉన్న జామియా మసీదు షాదీఖానాలో ముస్లిం మీటింగ్‌ను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ముస్లిం మైనార్టీల సమస్యలు, పరిష్కారాలు, రాజకీయ చైతన్యం అంశాలుగా సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ హాజరు కానున్నట్లు వివరించారు. 8వ తేదీన ఉదయం 10 గంటలకు ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

ఉరవకొండ, జనవరి 4: పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్ బాబు గురువారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కంప్యూటర్, ఎయిడెడ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, సాఫ్ట్‌వేర్ సహాయంతో కార్యాకలాపాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు ఆన్‌లైన్‌లోనే డాక్యుమెంట్‌లను సిద్ధం చేసుకుని చలానా కట్టవచ్చునన్నారు. 2023-24 సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా రూ.394కోట్లు ఆదాయమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

శబ్దకాలుష్యం నుంచి కాపాడండి

యాడికి, జనవరి 4: యాడికిలోని కోనరోడ్డు, హాస్పిటల్ కాలనీల్లో మైక్ నుంచి వచ్చే శబ్దకాలుష్యం బారి నుంచి కాపాడాలని కోరుతూ బీజేపీ నాయకులు, కాలనీవాసులు గురువారం పంచాయతీ కార్యదర్శి ఎర్రిస్వామికి ఫిర్యాదుచేశారు. హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు గుర్రప్ప, బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పిటల్ పక్కన ఉన్న చర్చి నుంచి మైక్‌ను ఎక్కువ శబ్దంతో వాడుతున్నారని తెలిపారు. అధికారులు తగు చర్యలు తీసుకొని అధిక శబ్దాల నుంచి స్థానికులను కాపాడాలని వారు కోరారు.

రైతు సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

రాయదుర్గంరూరల్, జనవరి 4: రాష్ట్రంలో రైతు సమస్యలను పరిష్కరించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున విమర్శించారు. గురువారం పట్టణంలోని 11వ సచివాలయం వద్ద సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో భూరక్ష పాస్‌బుక్ ప్రతులను దగ్ధం చేశారు. తిప్పేస్వామి, పట్టణ కార్యదర్శి కొట్రేష్, నరసింహులు, నాగరాజు, తిప్పేస్వామి, యోగేంద్ర, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు

యాడికి, జనవరి 4: కందిసాగులో నాణ్యమైన విత్తనాలు వాడడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని గుత్తి ఏడీఏ వెంకటరాముడు తెలిపారు. గురువారం మండలంలోని పుప్పాల గ్రామంలో జాతీయ ఆహార భద్రతా మిషన్ వారిచే కందిపంటలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా, గ్రామ వ్యవసాయ అధికారి త్రిపుర, రమేష్, రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం


విరాళం అందజేస్తున్న పెండేకల్లు వెంకటేష్

గుంతకల్లుటౌన్, జనవరి 4: మండలంలోని కసాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెండేకల్లు వెంకటేష్ రూ. 11,116 విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ కసాపురం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు స్వామిదాసు, దాసరి హరి, కురుబ రామాంజినేయులు, దాసరి చిన్నరాయుడు, పులకొండ, మహబుబ్‌పీరా, ప్రవీణ్, బోయరవి, పాల్గొన్నారు.

కాంగ్రెస్ బైక్ ర్యాలీ

కుందుర్పి, జనవరి 4: కాంగ్రెస్‌ను ఆదరిద్దాం రఘువీరాను గెలిపిద్దామంటూ గురువారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక పెట్రోల్ బంక్ నుంచి రామస్వామి ఆలయం వరకు కాంగ్రెస్‌ను ఆదరిద్దామని, రఘువీరాను గెలిపిద్దామంటూ నినాదాలు చేశారు. అనంతరం బైకుర్యాలీతో వెంకటంపల్లి, జంబుగుంపల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు రాంభూపాల్ రెడ్డి, కరణం తిప్పేస్వామి, మహేష్, రామాంజి, నాగరాజు వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కీచక యోగా ఉపాధ్యాయుడి అరెస్ట్

గుత్తి, జనవరి 4: ఓ బాలికను ప్రేమ పేరుతో శారీరక అవసరాలను తీర్చుకున్న యోగా కీచక ఉపాధ్యాయుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఎస్ఐ నబీరసూల్ సమక్షంలో డీఎస్పీ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. మండలంలోని తొండపాడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవుట్‌సోర్సింగ్ కింద యోగా ఉపాధ్యాయుడిగా కడప జిల్లా ప్రొద్దుటూ రు మండలం చౌకూరు గ్రామానికి చెందిన పల్లబోతుల అనిల్‌కుమార్ రెడ్డి పనిచేస్తున్నాడన్నారు. ఇదే పాఠశాలలో చదువుతున్న ఓ బాలికను ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పాడన్నారు. ఆ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మబాలికాడు. గత నెల 25న ఆ బాలికను తీసుకెళ్లాడు. తల్లిదండ్రులు బాలిక కనిపించలేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశారన్నారు. అయితే ఆ బాలికను తీసుకెళ్లి కర్నూలు జిల్లా అహోబిలంలో ఓ గదిని అద్దెకు తీసుకుని వారం రోజుల పాటు ఉంచుకొని లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక వద్ద ఉన్న బంగారు నగలు తీసుకున్నాడన్నారు. బంగారు, ప్రేమ, శారీరక కలయిక గురించి ఎవరికి చెప్పరాదని బెదిరించాడన్నారు. ఆ బాలిక బుధవారం గ్రామానికి వచ్చిందన్నారు. బాలికను పోలీసులు విచారించి నిందితుడిని పట్టుకునేందుకు ఎస్ఐ ఓ బృందంగా ఏర్పడి పట్టణంలోని బజాజ్ షోరూం వద్ద గురువారం అరెస్ట్ చేశామన్నారు. ఇతనిపై పోక్సో కింద కేసు నమోదు చేశామన్నారు. ఇతనిపై 2019లో ప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్‌లో రేప్ కేసు నమోదు అయ్యిందన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ నబీరసూల్, కానిస్టేబుల్ భాస్కర్‌నాయుడును ఎస్పీ అభినందించారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

తాడిపత్రి, జనవరి 4: పట్టణంలోని గర్ల్స్‌హైస్కూల్ వద్ద అరిఫ్‌ను హత్యచేసిన కేసులో గురువారం ఐదుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పట్టణంలోని ఆసుపత్రిపాలెంలో రెండున్నర సంవత్సరాల క్రితం తల్లి, బిడ్డ హత్య చేసిన సంఘటన విదితమే. ఈ కేసులో అరిఫ్ ప్రధాన నిందితుడుగా ఉన్నాడు. అరిఫ్‌ను హత్యచేసిన వారిలో తల్లి, బిడ్డకు సంబంధించిన వారు ఉండవచ్చన్న అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు.

నీటి గుంతలో పడి బాలుడి మృతి


కిరణ్‌కుమార్

డీ.హీరేహాళ్, జనవరి 4: నీటిగుంతలో పడి బాలుడు మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని హిర్దేహాళ్ గ్రామ సమీపంలోని ఓ పైపుల ఫ్యాక్టరీలోని నీటి గుంతలో పడి కిరణ్‌కుమార్(3) గురువారం మృతి చెందాడు. మండలంలోని హిర్దేహాళ్ గ్రామానికి చెందిన ఆంజినేయులు కుమారుడు కిరణ్‌కుమార్. తన తాత పైపుల ఫ్యాక్టరీలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. అవ్వ, తాతతోపాటు కిరణ్‌కుమార్ అక్కడికి వెళ్లాడు. ఫ్యాక్టరీ ఆవరణంలో నీటి నిల్వ కోసం పెద్ద గుంత తవ్వారు. బాలుడు ఆడుకుంటున్న బంతి నీటి గుంతలో పడింది. దాని కోసం వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయాడు. గమనించిన ఆ బాలుడి అవ్వ లక్ష్మి గుంతలోకి దూకి బాలుడిని బయటకు తీసుకువచ్చింది. వెంటనే ఆ బాలుడిని బళ్లారి ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. లక్ష్మి పరిస్థితి కూడా విషమంగా ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు.

జగన్ ఫొటోతో ముద్రించిన

పాస్ పుస్తకాలను రద్దు చేయాలి


సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

గుంతకల్లుటౌన్, జనవరి 4: సీఎం జగన్ ఫొటోలతో ముద్రించిన పాస్ పుస్తకాలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. మండలంలోని కసాపురం గ్రామ సచివాలయం వద్ద మండల కార్యదర్శి రాము రాయల్ అధ్యక్షతన గురువారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో పాస్ పుస్తకాలు భూమి అమ్మకాలు, కొనుగోలుకు, బ్యాంక్‌లో రుణాలు పొందడానికి ఉపయోగపడేవన్నారు. ప్రస్తుతం భూ సమగ్ర సర్వే పేరుతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించిందన్నారు. ఈ పాస్ పుస్తకాలు రుణాలు పొందడానికి, భూమి రిజిస్ట్రేషన్‌కు ఏ మాత్రం ఉపయోగం లేదన్నారు. అనంతరం పాస్‌పుస్తకాలను దగ్ధం చేశారు. రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి రామాంజనేయులు యాదవ్, మురళీకృష్ణ, ఉమర్ బాషా, గురుస్వామి, సూర్యనారాయణ, వినోద్, వెంకట్‌నాయక్, నూర్‌బాషా, సయ్యద్ బాషా పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

డీ.హీరేహాళ్, జనవరి 4: మండలంలోని హిర్దేహాళ్ గ్రామ సమీపంలో ఉన్న సపోటా తోటలో శివకుమార్(31) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... కర్ణాటక బళ్లారి జిల్లా కమ్మరిచేడు గ్రామానికి చెందిన శివకుమార్ మండలంలోని పులకుర్తి గ్రామంలో కృష్ణవేణిని వివాహం చేసుకున్నాడు. గత కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో భార్యతో పాటు వారంరోజుల క్రితం పులకుర్తి గ్రామానికి వచ్చాడు. ఈ తరుణంలో జనవరి ఒకటో తేదీన ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. ఆ రోజు నుంచి కుటుంబసభ్యులు అతని కోసం గాలిస్తున్నారు. పులకుర్తి, హీర్దేహాళ్ గ్రామాల సమీపంలో ఉరి వేసుకున్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

బొమ్మనహాళ్, జనవరి 4: మండలంలోని గోవిందవాడ క్రాస్‌లో కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు పట్టుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు గురువారం విలేకరులకు తెలిపారు. బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన తిప్పేస్వామి అనే వ్యక్తి ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యం తీసుకొస్తున్నట్లు సమాచారం అందడంతో గోవిందవాడ క్రాస్‌లో తనిఖీ చేయగా 288 మద్యం టెట్రా ప్యాకెట్లు ఉన్నాయన్నారు. మద్యంతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని తిప్పేస్వామిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కళ్యాణదుర్గం: కంబదూరు మీదుగా కళ్యాణదుర్గానికి 50 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను తీసుకెళుతుండటంతో సమాచారం అందుకున్న ఎస్ఐ యువరాజు గురువారం దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. మద్యం ప్యాకెట్లతో పాటు ఓ మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు.

యల్లనూరు: మండలంలోని శింగవరం గ్రామ సమీపంలో గురువారం రామాంజనేయులు నుంచి 29 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. అక్రమ మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి రామాంజనేయులును అరెస్ట్ చేశామన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

ఉరవకొండ, జనవరి 4: వజ్రకరూరు మండలం రాగులపాడు సమీప పొలాల్లో కే.రామన్న(77) అనే వృద్ధుడి మృతదేహాన్ని గురువారం పోలీసులు గుర్తించారు. అదే గ్రామానికి చెందిన రామన్న తరచుగా దేవాలయాలకు వెళ్తూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే 20రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గ్రామసమీపంలోని పొలాల నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడున్న ఆనవాలును బట్టి రాగులపాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కుమారుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తిరూరల్ జనవరి 4: మండలంలోని బాచుపల్లి గ్రామశివారులోని 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ధర్మాపురం గ్రామానికి చెందిన చిరంజీవి, రాజశేఖర్ ద్విచక్రవాహనంలో బాటసుంకులమ్మకి వెళ్తుండగా బాచుపల్లి గ్రామశివారులోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

8 మంది బైండోవర్

పుట్లూరు, జనవరి4: మండలంలోని కడవకల్లు, గాండ్లపాడు, చెర్లోపల్లి గ్రామాలకు చెందిన రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్యాక్షన్ గ్రామాల్లో ముందస్తుగా బైండోవర్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


బ్రహ్మానందరెడ్డి(ఫైల్)

పెద్దవడుగూరు, జనవరి 4: మండలంలోని కండ్లగూడూరు గ్రామానికి చెందిన బ్రహ్మానందరెడ్డి నాలుగురోజులుగా కనిపించడం లేదని పోలీసులు తెలిపారు. 2వ తేదీన పెద్దవడుగూరుకు వెళుతున్నానని ఇంటిలో చెప్పి తిరిగి రాకపోవడంతో తండ్రి రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

టీడీపీతోనే బీసీలకు ఉజ్వల భవిష్యత్తు


జయహో బీసీ కార్యక్రమానికి హాజరైన టీడీపీ నాయకులు

కణేకల్లు, జనవరి 4: టీడీపీతోనే బీసీలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర వాల్మీకి సాధికార సభ్యుడు కళేకుర్తి సుదర్శన్ అన్నారు. గురువారం విజయవాడలో జరిగిన జయహో బీసీ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఎన్‌టీఆర్ టీడీపీ పార్టీని ప్రవేశపెట్టినప్పటి నుంచి బీసీలకు సముచిత స్థానం కల్పిస్తూ వారి అభ్యున్నతికి పార్టీ కృషి చేస్తోందన్నారు. బీసీల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి వారి ఎదుగుదలకు కృషి చేసిందన్నారు. బీసీ సంఘం నాయకులు మొండి మల్లికార్జున, మురడి గంగాధర, గోపాల్ పాల్గొన్నారు.

స్థలం కబ్జాపై దళితుల ఫిర్యాదు

గుమ్మఘట్ట, జనవరి 4: అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు అండతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ స్థలాన్ని చెన్నప్ప అనే వ్యక్తి కబ్జా చేశాడని బీటీపీ గ్రామ దళితులు తహసీల్దార్ రఘు, ఎస్ఐ సునీతకు గురువారం ఫిర్యాదు చేశారు. దళితులు మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఆర్టీటీ పాఠశాల సమీపంలో ప్రభుత్వం కొంత స్థలాన్ని 15 ఏళ్ల క్రితమే కేటాయించిందన్నారు. ఆ స్థలంలో కొద్దిరోజులుగా గ్రామానికి చెందిన చెన్నప్ప అక్రమంగా పునాదులు తవ్వుకుని నిర్మాణం చేపడుతున్నాడన్నారు. గ్రామంలోని అధికారపార్టీకి చెందిన ముఖ్య నాయకుడి అండతో స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వెంటనే వాటిని తొలగించాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.


కుందుర్పిలో పనిచేయని సెల్‌ఫోన్లను ఉంచి హోమం చేస్తున్న కార్యకర్తలు


కళ్యాణదుర్గంలో గడ్డి తింటూ...


పుట్లూరులో...


గుమ్మఘట్టలో...

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

అంగన్‌వాడీల సమ్మె గురువారం 24వ రోజు కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లు నెరవేర్చాలని కార్యకర్తలు నినదించారు. వివిధ ప్రాంతాల్లో వినూత్నంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కళ్యాణదుర్గం, రాయదుర్గంలో పనిచేయని సెల్‌ఫోన్లను ఉంచి మంత్రాలు చదువుతూ నిరసన తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


గుంతకల్లులో ర్యాలీ...


గుత్తిలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు


రాయదుర్గంలో జగన్ మాస్క్‌తో ర్యాలీ

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదు

మున్సిపల్ కార్మికుల సమ్మె గురువారం తొమ్మిదో రోజూ కొనసాగింది. కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మెను కొనసాగిస్తామన్నారు. గుత్తిలో తాత్కాలిక సిబ్బందితో పంప్‌హౌస్ నుంచి నీటిని విడుదల చేస్తుండగా కార్మికులు వారిని అడ్డుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


కళ్యాణదుర్గంలో...